

# ఆడ-మగ

మంథా వెంకట రమణారావు

"బస్సు ఒకంతటికీ రాదే" అనుకుంది సుజాత బస్‌స్టాప్‌లో నిల్చొని.

"ఈ వెధవ బస్సు ఎప్పుడూ లేటే" అనుకుంది సరళ.

సుజాత ఆఫీసుకి వెళ్లాలి. సరళ కాలేజీకి వెళ్లాలి.

ఈ బస్సు ఇంతకీ అంతకీ రాదు. ఒకవేళ వచ్చినా ఓవర్‌లోడయి వస్తుంది

లేడీస్ సీట్లలో మగాళ్లు!

"లేవండి. అవి ఆడవాళ్ల జాగాలు. లేచి నిల్చొని సుజాతకీ, సరళకీ సీట్లివ్వండి."

"ఎలా నిల్చోడం? నిల్చుందుకీ చోటు లేదే. అయినా లేడీస్ సీట్లని సెగ్రిగేషన్ ఏమిటి? అందరికీ హక్కులు ఒకటే. సమాన హక్కులకోసం దెబ్బలాడుతున్నప్పుడు ఫయిటింగ్ సమానబలంతోనే జరగాలి కానీ ఈ రిజర్వేషన్లేమిటి?"

"లే! ముందు లే! తరువాత కబుర్లు చెప్పు. రిజర్వేషన్లు చేసుకోని ఆడ సీట్లేకాక రిజర్వుకాని మగ సీట్లలో కూడా ఆడవాళ్లే. వాళ్లని ముందు అక్కడనించి లెమ్మనండి."

"అక్కడ ముందు లే! తరవాత కబుర్లు చెప్పు. రిజర్వేషన్లు చేసుకోని ఆడ సీట్లే కాక రిజర్వు కాని మగ సీట్లలో కూడా ఆడవాళ్లే. వాళ్లని ముందు అక్కడనించి లెమ్మనండి."

"అక్కడ మగాళ్లకి అని రాసి లేదు. ఎవరన్నా కూర్చోవచ్చు."

కాని ఇవాళ ఆడ సీట్లలో అప్పలమ్మ, రత్తి, సింహాలు వీరంతా కూర్చున్నారు. కూరల గంపలు దగ్గర పెట్టుకున్నారు. బస్సంతా ఆక్రమించేరు. లేడీస్ సీట్లే కాదు జెంట్స్ సీట్లూ ఆక్రమించేరు. వీళ్లు లేడీసా? లేడీ అప్పలమ్మ. లేడీ రత్తి. లేడీ సింహాలు. వీళ్లు ఆడవాళ్లా? నలుగురు మగాళ్లని పిడికిలితో గుద్ది అణచీగలరు.

"ఏం అప్పలమ్మా? నువ్వు లేడీవా?"

"నాను లేడీనే బాబూ. సిన్నప్పుడు నా బావనేవోడు. లేడినాగ పరిగెడుతన్నవే అప్పాలూ అని."

"నువ్వు ఆడదానివేనా అని?"

"అదేట్రా అట్టాగడుగుతావు? తాగొచ్చినావేటి? కల్లు కనబడ్డం నేదా?"

సుజాత నిల్చుంది. సరళ నిల్చుంది. ఆడసీట్లు ఖాళీ లేవు. జనరల్ సీట్లు ఆడ- మగతో నిండిపోయేయి.

సుజాత చేతిలో చిన్న లంచ్ బాక్సుంది. సరళ చేతిలో పుస్తకాలున్నాయి.

ఇద్దరూ ట్రిమ్‌గా ఉన్నారు. పువ్వుల చీరలు కట్టేరు. ముఖాలకి కోటాలు కొట్టేరు. పెదాలకి లిప్‌స్టిక్, బుగ్గలకి రోజ్.

ఇంత అందంగా, నాజూగ్గా, సుమధురంగా, సుకుమారంగా నిల్చున్నా ఒక మాటన్నా మాటాడకుండా చూస్తున్నారే. ఒక్క మగాడన్నా లేచి తన సీటు ఇవ్వటంలేదు.

"ఏమయ్యా? ఆడవాళ్లు నిల్చున్నారు. లేచి సీటియ్యి."

"ఇవ్వను. ఎందుకివ్వాలి?"

"నా ముఖం పున్నమిచంద్రుడిలా వుంటుంది. నా కళ్ళు కలవరేకుల్లా వుంటాయి. అందుకు లేచి చోటియ్యి."

"ఇవ్వను. ఎందుకివ్వాలి?"

"నాకు సీటు ఇచ్చావంటే ఈ బస్సులో కూర్చున్నంతసేపూ నిన్ను ప్రేమిస్తాను."

"నువ్వందంగా వుంటే నీ మీద కవిత్వం అల్లుతాను. నువ్వు నన్ను ప్రేమిస్తే నేనూ నిన్ను ప్రేమిస్తాను. అంతే తప్ప సీటు మాత్రం ఇవ్వను."

"నీలో వీరత్వం, ధీరత్వం, షివల్రీ లేవా?"

"లేవు."

"నీ పెళ్లాం నిల్చుంటే, నీ చెల్లి నిల్చుంటే, నీ అమ్మ నిల్చుంటే నువ్విలాగే కూర్చోగలవా?"

"ఆ రోజులు ఏనాడో పోయేయి సిస్టర్! నా హక్కుల కోసం నేను పోట్లాడే రోజులొచ్చేయి.

ఆడ ఉద్యోగాలు కాక మగ ఉద్యోగాలూ కొట్టేస్తున్నారు. మీ కోసం స్పెషల్ ఆడ కాలేజీలు. ఆడ స్కూళ్లు. అవికాక మా కాలేజీలలో సీట్లు. ఐ.ఏ.ఎస్‌లో మొదటి ముగ్గురూ వీళ్లే. లెక్చరర్ల ఉద్యోగాలు వాళ్లవే. నర్సుల ఉద్యోగాలూ వాళ్లవే. టైపిస్టుల ఉద్యోగాలూ వాళ్లవే. మగ క్యూలోనూ నిల్చుంటారు, ఆడ క్యూలోనూనిల్చుంటారు. పత్రికలలో ఎక్కడ చూసినా వీళ్ల సీరియల్సే. దేశాలన్నీ వీళ్లే పాలిస్తారుట. యుద్ధాలూ వీళ్లే చేస్తారుట''

''ఎందుకుట ఏడుపు?''

''ఎందుకా? నాకే ఉద్యోగం వస్తే పెళ్లి చేసుకొని, పెళ్లాం పిల్లల్ని పోషించుకుంటాను. ఆవిడ ఉద్యోగం చేస్తే ఏం చేస్తుందో తెలుసా? నాకు రావల్సిన ఉద్యోగం కొట్టేస్తుంది. ఆ డబ్బు ఆవిడకి పాకెట్ మనీ. మగాడ్ని అడిగేవాడెవడు? ఇంటర్వ్యూలో ఆడది పోటీగా నిలబడితే మగాడి పని గోవిందే! నాకు ప్రమోషన్ రావల్సి ఉంటే, ఆడది పోటీకి వస్తే నా పని గోవిందా! నేను పోటీకి నవల పంపుతే, ఆడది పోటీకి వస్తే నా పని హరీ హరీ! పడవమునిగిపోతూ వుంటే లేడీస్ అండ్ చిల్డ్రన్ ఫస్ట్ అంటాడు కెప్టెన్. అందువల్ల నాకు దొరికిన సీటు ఇవ్వను గాక ఇవ్వను'' అన్నాడు దుఃఖారావు.

ఆఫీసుకి వెళ్ళే సుజాతకీ కోపమొచ్చింది. కాలేజీకి వెళ్ళే సరోజకీ కోపమొచ్చింది. మొదట సరళ విసురుగా మాట్లాడింది. ఆమె యువ రక్తం ఆ మాటలకి ఉడికిపోయింది. సరళ వీనులవిందుజేసే కంఠంతో ఇలా మాట్లాడింది.

''ప్రపంచ జనాభాలో సగం మంది మగాళ్లయితే సగం మంది ఆడవాళ్లని తెలిసీ కూడా ఇలా మాట్లాడుతున్నారా? ఈ బస్సులోని సంఖ్యని లెక్కపెట్టండి. నలభై మంది మగాళ్ళు పదిహేనుమంది ఆడవాళ్లున్నారు. రోడ్లమీదా, బజారులోనూ తిరుగుతున్న జనాల్ని లెఖ్ఖపెట్టేరా? నూటికి పదిమందికన్నా ఎక్కువ ఆడవాళ్లుండరు. నాకేం సరదానా చదవడం? నాకేం సరదానా ఉద్యోగం చెయ్యడం? ఉద్యోగం గురించి సుజాత చెప్తుంది. చదువు గురించి నేను చెప్తాను. నాకు చదువుకోవాలని ఉందేరా? హాయిగా ఆడుతూ పాడుతూ రోజులు గడిపేయాలని ఉంది. పెళ్లి చేసుకొని, మొగుడూ, పిల్లలూ, సంసారం చూసుకోవాలని ఉంది. ఇలా గడపదాటి అవతలకి అడుగుపెట్టాలనే లేదు. ఈ లెక్కలూ సైన్సూ, హిస్టరీ, జాగ్రఫీ నాకెందుకు? ప్రేమించడం, ప్రేమించబడడం తప్ప నాకు మరేమీ వద్దు. ప్రపంచాన్ని ప్రేమిస్తాను. ప్రకృతిని ప్రేమిస్తాను. ఆనందాన్ని ప్రేమిస్తాను. కోయిల కూతని వినడం, రామచిలక పంచరంగుల్ని చూసి ఆనందించడం, ఏ బాదరబందీ లేకుండా ఫ్రీగా ఉండడం నాకిష్టం. కానీ నాన్న, అమ్మ ఐదేళ్లొచ్చిం దగ్గర్నించి ఈ చదువులో పెట్టేరు. చదువు, చదువు చదువు. చదవకపోతే నీకు గతి లేదు. 'నీకు కట్నం తేలేను. చదువుకుంటే నీ కాళ్లమీద నువ్వు నిలబడితే, నీ ఉద్యోగం, నీ ఆర్జన చూసి ఒక మగాడు నీకు పుస్తె కట్టవచ్చు కట్నం లేకుండా' అదీ నాన్న కల! అందుకు చదువుతున్నాను. ఇంట్లో కూర్చొని పగటి కలలు కనాలని ఉంటుంది. ఊరకే కూర్చుంటే పాడయిపోతానని వాళ్ల భయం! చదువు లేని ఆడదాన్ని ఎవ్వడూ ఒల్లడని అమ్మ భయం.''

''మీ పిల్ల ఏం చదివింది?''

''ఛా! పల్లెటూరు సరుకురా! కనీసం బి.ఏ. అన్నా చదివుంటే!''

''బి.ఏ చదవగానే అంద వికారమైనది అందకత్తె అయిపోతుందా? బి.ఏ చదివి ఎకనమిక్ థియరీ వీడి ఇంట్లో ప్రాక్టీసు చెయ్యాలనా? నాకు వంట చెయ్యడం పిల్లల్ని కనడం, ఇంటిడి చాకిరీ చెయ్యడం తప్పుతాయా? వీడు బి.ఏ. పాసయిన దాన్ని పెళ్లాడేడని వీడి ఆఫీసరు వీడికి ప్రమోషను ఇస్తాడా? వీడి జీతం ఒక నయాపైసా అన్నా పెరుగుతుందా? మీ బుర్రలకి ఇవేవీ ఎక్కవు.''

కాలేజ్ స్టాప్... దిగండి!... దిగండి!... దిగింది సరళ విజ్ఞానపు బరువు మోస్తూ.

''అబ్బో! ఈ పిల్లకి మా చెడ్డ విసురు.'' అన్నాడొకడు.

''ఇవాళా రేపూ ఆడపిల్లల్తో మాట్లాడలేం. ఈ సినిమాలొచ్చి పాడుచేసేస్తున్నాయి ఆడవాళ్లని. ఎందుకోసం తీస్తున్నారు ఆ సినిమాలు?''

''వాళ్లు డబ్బుకోసం తీస్తున్నారు. మేం ఊసుపోక చూస్తున్నాం. సినిమాలు చూడడం తప్ప జీవితాశయం ఏముంది? పుట్టేం కనక చచ్చేవరకూ కాలాన్ని చంపాలి కదా? మరేం ఆశయం ఉంది జీవితంలో? తిండి తినడం. తరవాత సెక్సు. తక్కిన కాలాన్ని ఏం చెయ్యాలి?''

బస్సు బయల్దేరింది మళ్లా.

ఆడది నిల్చుంది చోటివ్వండి.

''ఇవ్వం.''

''మీరిచ్చినా నాకొద్దు. సమాన హక్కులలో

# వెలుగుల్లో మలగాలని...

వాడు పగలేసింది పలకే అయినా
ఓ పూట శ్రమ విరిగి
అతని కడుపు - తంత్రులు తెగిన వీణ అయింది.
చింపింది స్కూలు పుస్తకాల్నే అయినా
ఖరీదు గరుకు చాకిబండ అయి
దుస్తులు - శరత్కాల మేఘాలయ్యాయి

ఫీజుల పద్దన్న మాశించిన వాడి చదువు
అతనికి - రాగిసంకటి పక్కుల్ని నైవేద్యం చేసింది.
కళాశాల దినాలు చెదపురుగులై
బక్కెద్దుల్ని మడిముక్కని తిని
కూలితనం అరచేతుల కంటించాయి.
ఉద్యోగం వాణ్ని వరించేందుకు
తల్లి తాళి చివరి దూతిక అయింది

వాడి కోసం ఆ కష్టాల దొంతర
ఎన్ని యీదురుగాలుల్ని భరించాడని!
కళ్ళ ప్రమిదల్లో ఆశల్ని దీపాలుగా
ఎన్ని జీవితాల్ని శ్వాసించాడని!

ధన గంధపు వివాహబంధం ముందు
పేగు బంధం మైలగా అనిపించి
వాడు - దూర తీరాలకు జరిగినా —
ఆ వృద్ధుని కళ్ళలో ఇంకా ఆరని ఆశల దీపాలు.
ఇల్లు పాడు బావి అయి
రోగ పాశాల పాచి వల మొహాన కప్పినా
కళ్ళ పిలమణులు గాజుగోళీలై
అర్ధనిమీలిత మిథ్యావీక్షణహస్తాలతో దూరాల్ని తడుముతూ
ఇంకా వాడొస్తాడని —

కొడిగట్టిన దీపమై
తన స్మృతుల పొగల్ని తనే వంజుకొంటూ
మొండి గోడల మధ్య నించి వీధి మలుపు దాకా —
ఇంకా వాడొస్తాడని ...

గుండె భిక్షా పాత్ర అయి
పిడికెడు ప్రేమ కోసం చిటికెడు ఆదరణ కోసం
ఎండిన పెదాలతో ఎదురుచూస్తూ...
ఇంకా వాడొస్తాడని...

తను రత్నంగా మలిచిన ఆ గులకరాయి
పుట్టిన మట్టి పాదు చేరుకుని వెలుగుతుందని,
ఆ వెలుగుల్లో తను మలగాలని...

—సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి

మాకు నిల్చునే హక్కు కూడా ఉంది.''

''మీ పని నిల్చోడమా?''

''ఔను. నేను రిసెప్షనిష్టుని. నా పని నిల్చోడమే. చిరునవ్వుతో తియ్యగా మాట్లాడ్డమే. రోజుకి ఎనిమిది గంటలు ఆఫీసులో, ఎనిమిది గంటలు ఇంట్లో.''

''ఇంట్లో మీకేం పని? హాయిగా కాలుమీద కాలు వేసుకొని...''

''అలా అనుకొనే ఆ సరళలా పొరపడ్డాను.''

''సరళ చేసిన పొరపాటేమిటి? మీరు చేసిన పొరపాటేమిటి?''

''పెళ్లి కోసం చదువుతోంది సరళ. కట్నం ఇచ్చుకోలేక చదువుతోంది. చదువుకుని ఉద్యోగాన్ని సంపాదించి దానినే కానుకగా ఇద్దామని ఆశపడుతోంది. గృహమేకదా స్వర్గసీమ అనుకుంటోంది. అదే పొరపాటుని సరళ కన్న ముందు నే చేసేను.''

''పోనీ సరళకి చెప్పండి.''

''చెప్పినా దానికి తలకెక్కదు. అందరూ వెళ్లే దారినే వెళ్తారు మనుష్యులు. సరళలానే నేనూ చదివేను. బి.ఏ. అయింది. ఏ మగాడూ నా డిగ్రీతో మెరుస్తున్న నన్ను చూసి భార్యగా చేసుకుందుకి ముందుకి రాకపోగా ఎం.ఏ. చదివేను. అది మరో పొరపాటయింది. నా వయస్సు రెండేళ్లు పెరగడమే కాదు. ఎం.ఎ. దగ్గరకి మరో మగ ఎం.ఎ.నో, తత్తుల్యమైన మగాల్లో తప్ప తక్కినవాళ్లు రారు. మగాడికి చదువు ఎక్కువవుతున్నకొద్దీ వనితలని పెళ్లికి ఎంచుకొనే ఫీల్డు ఎక్కువవుతుంది. ఆడదానికి చదువు ఎక్కువవుతున్నకొద్దీ ఫీల్డు తగ్గిపోతుంది.''

''తరవాత?''

''అప్పటికీ ఎవరూ దొరక్కపోతే ఉద్యోగం సంపాదించి మరింత ఆకర్షణీయంగా తయారయేను. ఎలాగో నే పరచిన విశాలమైన వలలో ఒక మగ చేప పడింది. లక్ష రూపాయల ప్రయిజు దొరికినంత సంబరపడ్డాను. సినిమాలో అయితే ఇక్కడితో కథ అయిపోతుంది. కాని జీవితంలో కథ మొదలవుతుంది ఆడదానికి. నా జీవితంలో రెండో పార్టు ఆరంభమయింది. నేను చెయ్యాల్సిన ఉద్యోగాలు పెరిగేయి.''

''ఉద్యోగాలా?''

''వంటపుట్టిగా, పనిమనిషిగా, పిల్లల్ని పెంచే ఆయాగా...''

''వంటపుట్టిని పెట్టుకోలేదా?''

''నేను వండందే మావారికి రుచించదు. నేను ఉతికి ఇస్త్రీ చేసిన బట్టలు వేసుకోడమే ఆయనకిష్టంట. ఉద్యోగం మానిద్దాం అంటే సాధ్యపడటంలేదు. నే తెచ్చే వెయ్యి లేకపోతే అందుకు అలవాటుపడ్డ సంసార చక్రం ఆగిపోతుంది. ఇప్పుడు దొరికే తిండీ బట్టా కూడా కరువవుతాయి. ఆయన దృష్టిలో లోకువయిపోతాను. మరో రహస్యం. నాకేమన్నా విశ్రాంతీ, హాయీ దొరుకుతున్నాయంటే ఆఫీసులోనే. మెట్రిక్‌తో చదువాపేసి ఇంటి దగ్గర కూర్చొని ఉంటే ఎంత బాగుణ్ణు అనిపిస్తుంది. అందుకే సరళని చూస్తే జాలి వేస్తుంది. సరళా అదే పొరపాటు చేస్తోంది. కానీ అంతకన్నా గతేముంది?''

''అదిగో సీటు కాళీ అయింది. కూర్చోండి!''

''నా స్టాపు వచ్చేసింది. నాకు కూర్చొనేందుకు ఛాన్స్ ఎప్పుడూ రాలేదు. నా నొసట నిల్చోమనే రాసిపెట్టి ఉంది!''


నూతన యవ్వనం పొందండి! సంతానవంతులుకండి!!
చర్మవ్యాధులు నుండి విముక్తులు కండి!!!



హస్తప్రయోగము వలన కలిగిన నరముల బలహీనత, అంగము చిన్నదగుట, అవసరకాలమందు అసంతృప్తి, దాంపత్య సుఖం లేకపోవుట, సంతానము లేకపోవుట, సొరియాసిస్, తెలుపు (బొల్లి), నలుపు, ఎరుపు మచ్చలు, రసిపుండ్లు, సుఖసంబంధమైన వ్యాధులు, ఫిస్టులా స్త్రీల కుసుమ వ్యాధులకు, చర్మ వ్యాధులకు చికిత్స చేయబడును. పోస్ట్ ద్వారా కూడా చికిత్స కలదు.

క్యాంపులు

ప్రతినెల 1,16 తేదీలలో రాజమండ్రి, హోటల్ అశోకాలో, కోటగుమ్మం వద్ద.
ప్రతినెల 2,17 తేదీలలో కాకినాడ, వీనస్ A/C లాడ్జి, కల్పనాటాకీస్ వద్ద.
ప్రతినెల 3,18 తేదీలలో భీమవరం, షణ్ముఖలాడ్జిలో.
ప్రతినెల 9వ తేదీన ఒంగోలు, హోటల్ పూర్ణిమ లో, బస్టాండ్ వద్ద.
ప్రతినెల 25వ తేదీన ఖమ్మం, హోటల్ కిన్నెర A.C లో. బస్టాండ్ వద్ద.
* ప్రతిక్యాంపులోనూ ఉ॥గం॥10 నుండి రా॥గం॥10 వరకు పై క్యాంపు తేదిలు మినహా మిగిలిన రోజుల్లో డాక్టరు గారు గుడివాడ క్లినిక్‌లో వుంటారు.

SHAH/BACHI

40సం॥ల గొప్ప అనుభవం గల ఆయుర్వేద అలంకార
డా॥ డి. మార్కండేయులు
సెక్స్, స్కిన్ వ్యాధులకు అనువంశిక ఆయుర్వేద వైద్య నిపుణులు
పార్కురోడ్, గుడివాడ-1, ఫోన్స్: 2522 & 2540